క్లుప్తంగా

ల్యాబ్ గదుల్లో మరమ్మతులు చేయాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన ల్యాబ్ గదులు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని డీఐఈవోకు వినతిపత్రం అందించారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరైన గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కళాశాలల్లో ల్యాబ్స్, తరగతి గదులు మరమ్మతు చేపించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నాయకులు అనిల్ గౌడ్, సామల శ్రీకాంత్, మట్టి తిరుపతి, సంపత్, లక్ష్మణ్, నితిన్, రవి, హరీశ్, సంతోష్, అజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల పరిశీలన



జాత్రాగ్రౌండ్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఆలయ అధికారులు

వేములవాడ: రాజన్న ఆలయ పరిసరాల్లోని భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో డ్రైనేజీలు కూరుకుపోయి దుర్వాసన వస్తోంది. మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఏఈవో అశోక్‌తోపాటు మున్సిపల్, ఆలయ శానిటేషన్ విభాగం అధికారులు సిబ్బంది డ్రైనేజీలను పరిశీలించారు. ఐదు ఫీట్ల డ్రైనేజీలు నాలుగు ఫీట్ల వరకు మట్టి, చెత్తలతో కూరుకుపోయి ఉన్నాయనీ, తక్షణమే శుభ్రం చేయించాలని నిర్ణయించారు. ఇక్కడ ఆలయ అధికారులు వరి నర్సయ్య, శ్రీకాంతాచారి ఉన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి



వేములవాడఅర్బన్: విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని బహుజన సేన జిల్లా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జింక శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు బహుజనసేన జిల్లా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి గడపకూ రాజ్యాంగం కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకోవడం కోసం, హక్కులు వినియోగించుకొని బాధ్యతలు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు అంజయ్య, శ్రీనివాసరావు, గుడిసె మనోజ్ కుమార్, సాగర్, జింక శ్రీనివాస్, గుడిసె అరుణ్, జింక శ్రీకాంత్, బండి రంజిత్, బండి శ్రీకాంత్, నేదూరి రాజు తదితరులు ఉన్నారు.

డీఎల్‌పీవో విచారణ



జీపీ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నరేశ్

రుద్రంగి: మండలకేంద్రంలో అన్యాక్రాంతం అయిన జీపీ ల్యాండ్ డొంక కదులుతుంది. జీపీ ల్యాండ్ అన్యాక్రాంతమైందని ‘సాక్షి’లో ప్రచురించడం, స్థానిక యువకుడు హైకోర్టులో వేసిన ప్రజా ప్రయోజన వాజ్యంతో విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. దీంతో మంగళవారం డీఎల్‌పీవో నరేశ్ విచారణ చేపట్టారు. అన్యాక్రాంతమైన జీపీస్థలాన్ని పరిశీలించారు. విచారణ పూర్తి చేశామని, వివరాలను ఉన్నతాధికారులు, హైకోర్టుకు నివేదిస్తానని తెలిపారు.

మధ్యాహ్నం వరకు తెరుచుకోని మద్యం దుకాణాలు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని మద్యం దుకాణం మంగళవారం మధ్యాహ్నం వరకు తెరుచుకోలేదు. దీంతో మండల కేంద్రంలో ఉన్న మూడు వైన్స్‌ల వద్ద మందుబాబులు బారులుతీరారు. ఇదే అదనుగా బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రభుత్వం బీర్లపై ధరలను పెంచిన నేపథ్యంలో వైన్స్‌లోని బీర్లు, ఇతర మద్యం స్టాక్‌ను పరిశీలించి, లెక్కించినట్లు ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు. మధ్యాహ్నం తర్వాత వైన్స్ తెరుచుకున్నాయి.

ఇల్లంతకుంట: మండలంలోని మద్యం దుకాణాలను మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు తెరిచారు. బీర్ల ధర రూ.30 పెంచడంతో ఎక్సైజ్ అధికారుల సూచన మేరకు మద్యం షాపులను ఆలస్యంగా తెరిచినట్లు వైన్స్ యజమాని తెలిపారు.

కాంప్లెక్స్ సమావేశం సందర్శన


కోనరావుపేట: ధర్మారం ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఇంగ్లిష్ కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సందర్శించారు. కాంప్లెక్స్ సమావేశానికి కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల, వీర్నపల్లి మండలాల నుంచి ఇంగ్లిష్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. డీఈవో వెంట మండల విద్యాధికారి మురళీనాయక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ముస్తాబాద్: మండలకేంద్రంలోని శ్రీ మదేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బైండ్ల కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. రజక సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

నేడు గోవిందరాజుల కల్యాణం



చందుర్తి: మండలంలోని సనుగుల శివారు గుట్టపై శ్రీ గోవిందరాజుల స్వామి కల్యాణం బుధవారం నిర్వహిస్తున్నట్లు శాశ్వత ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేడుకలకు ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వేములవాడ, కథలాపూర్‌తోపాటు హైదరాబాద్ నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి కల్యాణానికి తరలివస్తారని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

సిరిసిల్లటౌన్: విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర సర్కార్లు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం సిరిసిల్ల కార్మిక భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ సభకు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసే కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం విద్యారంగం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాగా జిల్లాలో ఇతర యూనియన్ల నుంచి



ఏఐఎస్ఎఫ్‌లో చేరిన విద్యార్థులతో వెంకటస్వామి

ఏఐఎస్ఎఫ్‌లోకి విద్యార్థులు భారీగా చేరారు. వారికి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు, నాయకులు కడారి రాములు, పంతం రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు చైతన్య దీపికలు

ముస్తాబాద్: గ్రంథాలయాలు చైతన్య దీపికలని సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ అన్నారు. ముస్తాబాద్‌లో అద్దెగదిలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం పంచాయతీ ఆవరణలోని రీడింగ్‌ను సందర్శించి మాట్లాడారు. ముస్తాబాద్‌లో సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పంచాయతీ లేఅవుట్ స్థలాన్ని గతంలో గ్రంథాలయం నిర్మాణానికి తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఇక్కడే లైబ్రరీ నిర్మించేందుకు ప్రతిపాదనలు చేస్తామని, అప్పటి వరకు పంచాయతీ ఆవరణలోని రీడింగ్ రూమ్‌లోకి గ్రంథాలయాన్ని తరలించి, పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా



రీడింగ్‌రూమ్ పరిశీలిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

ముస్తాబాద్‌కు వచ్చిన సత్యనారాయణను కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. తహసీల్దార్ సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు గుండెల్లి శ్రీను, సుమతి, నరేశ్, ఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ మొగిలి

ఇల్లంతకుంట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. ఓబులాపూర్‌లో మంగళవారం మీకోసం పోలీస్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ఎస్సై శ్రీకాంత్ గౌడ్, విలేజ్ పోలీస్ ఆఫీసర్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై కేసీఆర్ కుటుంబం మొసలికన్నీరు

సిరిసిల్లటౌన్: రైతులపై కేసీఆర్ కుటుంబం మొసలికన్నీరు కారుస్తుందని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, నామాపూర్‌కు చెందిన మహిళా రైతుకు సంబంధించి రైతుబంధు, తదితర అంశాలపై ఆ పార్టీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. సదరు మహిళకు అందిన రైతుబంధు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్‌కే ప్రజల మద్దతుందని, ఇకనైనా కేసీఆర్ కుటుంబ సభ్యులు ప్రతిపక్ష బాధ్యతలతో ప్రజల పక్షాన నిలవాలని సూచించారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు విడ్డూరం



ముస్తాబాద్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలు విడ్డూరమని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నామాపూర్‌కు చెందిన నకీర్తి కనుకవ్వకు రైతు భరోసా కింద రూ.1650 పడ్డాయని ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. నామాపూర్‌కు వెళ్లి కనుకవ్వతో మాట్లాడారు. ఆమె పట్టాదారు పాస్‌పుస్తకాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి స్వగ్రామం నామాపూర్ కాబట్టే హరీశ్‌రావు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మొత్తం 11 గుంటలు కనుకవ్వ పేరిట ఉండగా రూ.1,650 వేసిందన్నారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, కొంరయ్య, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి: ఉరేసుకొని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలో అద్దెఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్న వేముల సతీశ్‌కుమార్ (65) పవర్లూమ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఏడాదిగా పవర్లూమ్ పనికి వెళ్లకుండా కూలి పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు, ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి కలెక్టర్ చేయూత



కుట్టుమిషన్‌ను అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల: బాధిత కుటుంబానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చేయూత అందించారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాస్ దివ్యాంగుడు. అనారోగ్య కారణాలతో ఇటీవల అతడు మరణించగా, తన కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌ను శ్రీనివాస్ భార్య గాజుల అఖిల వేడుకున్నారు. స్పందించిన కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆమెకు కుట్టుమిషన్ అందించారు. ప్రభుత్వ యూనిఫాం ఆర్డర్లను అఖిలకు అందించి ఉపాధి కల్పించాలని డీఆర్‌డీవో శేషాద్రిని ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు అఖిల కృతజ్ఞతలు తెలిపారు. చేనేత, జౌళిశాఖ ఏడీ సాగర్, కుట్టుశిక్షణ కేంద్రం ఇన్‌చార్జి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని లేబర్ అడ్డాలో మంగళవారం భవన నిర్మాణ కార్మికుల జిల్లా 3వ మహాసభల కరపత్రాలను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 55ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, సహజ మరణానికి రూ.5 లక్షలు, యాక్సిడెంట్‌కు రూ.10 లక్షలు అందించాలని, లేబర్ కార్డులు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు భోల శ్రీనివాస్, పెయింటర్ బాలయ్య, శేఖర్, గొడిసెల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయిస్తున్నారు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని కాంగ్రెస్ నేతలకు చట్టాలు వర్తించవా ? ఈ విషయంలో అధికార యంత్రాంగం చూసీ చూడకుండా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నాయకుడు మాట్ల మధు ఆరోపించారు. మంగళవారం సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ నేతలు చేయని తప్పులతో పాటు నిబంధనల ఉల్లంఘన పేరుతో అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకుడు ఉద్యోగాలు ఇప్పిస్తానని బడుగు బలహీనవర్గాల వారి వద్ద డబ్బులు దోచుకున్నా అతనిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొయ్యడ రమేశ్, చిలువేరు చిరంజీవి, ఇమ్మనేని అమర్ రావు, కంచర రవి గౌడ్, గుండు ప్రేమకుమార్, కుర్మ రాజయ్య, ఆత్మకూరు చంటి, నీరటి బాబు, బండి జగన్, బండి దేవేందర్ యాదవ్, సయ్యద్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

పశు వైద్యశాల తనిఖీ

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి, ఇల్లంతకుంట పశువైద్యశాలలను మంగళవారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. అలాగే సోమారంపేట గ్రామానికి చెందిన గొట్టం సుమలత నేషనల్ లైవ్‌స్టాక్ యూనిట్ కొనుగోలుకు దరఖాస్తు చేసుకోగా, పథకానికి సంబంధించి అంశాలను పరిశీలించారు. ఆయన వెంట ఇల్లంతకుంట పశువైద్యశాల ఇన్‌చార్జి డాక్టర్ ఇందిర ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● **బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం**

ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని, బీసీలు ఐక్యంగా ఉన్నప్పుడే రాబోయే ఎన్నికల్లో రాజ్యాధికారం సాధిస్తారని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వరి వెంకటేశ్ అన్నారు. బీసీల జనాభాను తక్కువ చేసి చూపిందని ఆరోపిస్తూ మండలకేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాష్ట్రంలో 51శాతం బీసీల జనాభా ఉందని ప్రకటించగా, తాజాగా 46 శాతం ఉందని చూపడం విడ్డూరంగా ఉందన్నారు. ఓబీసీ మండల అధ్యక్షుడు వెంకన్న, క్రాంతి, కృష్ణ, తదితరులు ఉన్నారు.

● **వానరానికి వైద్య సేవలు**

వేములవాడ : వేములవాడ పట్టణంలోని భీమేశ్వరాలయం వీధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి కరెంట్‌షాక్‌కు గురైన వానరానికి ఆలయ ఉద్యోగులు, భక్తులు గమనించి సెస్ అధికారులకు మంగళవారం సమాచారం అందించారు. వానరాన్ని ప్రమాదం నుంచి కాపాడి ఆలయ గోశాల అసిస్టెంట్ వెటర్నరీ సిబ్బంది తరుణ్, మణిసాయిలు వైద్య సేవలందించారు. దీంతో వానరం కోలుకుని బయటికి వెళ్లిపోయింది.

● **అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై కేసు**

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్‌కు చెందిన కంకణాల సుధాకర్ ట్రాక్టర్ ట్రాలీ ఒక నంబర్‌పై ఇసుక తరలింపుకు అనుమతులు తీసుకోని, మరో వాహనంలో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. సుధాకర్ ట్రాక్టర్ ట్రాలీ నంబర్‌పై ఇసుక తరలించేందుకు అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. అనుమతులు తీసుకున్న ట్రాలీలో కాకుండా మరోనంబర్ ఉన్న ట్రాలీలో ఇసుక తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని సుధాకర్, డ్రైవర్ నర్సింలుపై కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

● **ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

ఇల్లంతకుంట: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కే శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. కందికట్కూర్‌కు చెందిన రంగు రజనీకాంత్ (36), మామిండ్ల పరుశురాం (42), పొత్తూరు బిక్కవాగు సమీపం నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

● **డివైడర్‌ను ఢీ కొట్టిన ఆటో**

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్న ఆటో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

● **ద్విచక్ర వాహనం చోరీ**

ముస్తాబాద్: మండలకేంద్రంలోని పోతుగల్ రహదారిలో దుకాణం ఎదుట పార్క్‌చేసిన బైక్ చోరీకి గురైంది. ఇరుకుల్ల రాజు తన ఇంటి ముందు వాహనాన్ని ఉంచగా, సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన రాజు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● **రిమాండ్‌కు తరలింపు**

కోనరావుపేట: ఇంటివద్ద నిలిపి ఉన్న ఆటోలో నుంచి సిలిండర్లను ఎత్తుకెళ్లిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కోనరావుపేటకు చెందిన ముడారి పోశెట్టి ఈనెల 10న తన ఇంటి వెనుకాల ఆటో నిలిపి పడుకున్నాడు. నిమ్మపల్లికి చెందిన ఇస్లావత్ మోహన్ నాయక్ రెండు సిలిండర్లను ద్విచక్రవాహనంపై ఎత్తుకెళ్తుండగా వెంబడించి పట్టుకున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ద్విచక్రవాహనం, రెండు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. బైక్ కూడా కరీంనగర్‌లో ఎత్తుకొచ్చినట్లు తేలడంతో మోహన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

● **వృద్ధుడి అదృశ్యం**

కోనరావుపేట: మల్కపేటకు చెందిన కట్ల పర్శయ్య (72) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పర్శయ్యకు భార్య దేవవ్వ, ఇద్దరు కుమారులు నాగరాజు, ప్రశాంత్ ఉన్నారు. చిన్న కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బోయినపల్లి: మండలంలోని మాన్వాడ మిడ్‌మానేరు ప్రాజెక్టు కట్ట పరిసరాల నుంచి కొదురుపాక, వెంకట్రావుపల్లి గ్రామాల వరకు వెళ్లే దారికిరువైపులా ముళ్ల పొదలు కమ్మేశాయి. ఈ దారి మీదుగా వెళ్లే రైతులు, ప్రజలు ముళ్లపొదలతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైకి వచ్చిన ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : శ్రీనివాస్
డీఈఈ, మిడ్‌మానేరు ప్రాజెక్టు, సెల్‌నంబర్: 9849461464

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పంటలు ఎండిపోకుండా నీరందించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి పంటకు మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. మండలంలోని రాచర్లగొల్లపల్లి, దేవునిగుట్ట తండా, రాజన్నపేట, అల్మాస్‌పూర్, రాచర్లతిమ్మాపూర్, బాకూర్‌పల్లి తండాలో సుమారు 400 ఎకరాల్లో పంటలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం వరి పంటలు ఎండిపోతున్న క్రమంలో మల్కపేట నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై తక్షణమే స్పం



విప్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దించిన విప్ నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, గంగయ్య, వెంకటేష్, బాపురెడ్డి, పెంటయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యోదయం వేళ.. చేపల వేట





మత్స్యకారులు చలిని సైతం లెక్క చేయకుండా సూర్యోదయం వేళ మధ్యమానేరు జలాశయం వద్దకు చేరుకొని చేపలు పడుతున్నారు. మంగళవారం ఉదయమే ఓ మత్స్యకారుడు మిడ్ మానేరు జలాశయం వద్ద వలతో చేపలు పడుతుండగా ‘సాక్షి’ క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

తంగళ్లపల్లి: త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం మండలంలోని పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం నోటీస్ బోర్డుపై పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల జాబితాలో అభ్యంతరాలను ప్రజలనుంచి స్వీకరించి 15న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చందుర్తి: మండల పరిషత్ కార్యాలయంలోని నోటీస్ బోర్డుపై జెడ్పీటీసీ, ఎంపీటీసీల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల ముసాయిదాను విడుదల చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్, మండల పరిషత్ సూపరింటెండెంట్ సురేందర్, టైపిస్ట్ శరణ్య, కంప్యూటర్ ఆపరేటర్ సాగర్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల వివరాలను అందుబాటులో ఉంచారు. ఎంపీవో రాజు, ఏపీవో కొమురయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

కార్మికుల పొట్ట కొట్టొద్దు



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: కాటన్ చేనేత చీరలు ఉత్పత్తి చేసే కార్మికుల పొట్టగొట్టేలా యజమానుల చర్యలున్నాయని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ అన్నారు. మంగళవారం కార్మికుల సమావేశంలో మాట్లాడారు. కూలి పెంచాలని వినతిపత్రం ఇచ్చినందుకు తమ వద్ద పనిచేస్తున్న వందమంది కార్మికులను ఆసాములు తక్షణమే పనులు బంద్ పెట్టించి కార్ఖానాల నుంచి వెళ్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు యజమానులు వెంటనే వైఖరి మార్చుకొని కార్మికులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారం చేసుకోవాలని కోరారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవలని లేకుంటే చేనేత చట్టాన్ని అమలు చేసే అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వడ్నాల వీరేశం, నల్ల మార్కండేయులు, సంపత్, జక్కని ఆనందం, సత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఇదే చివరి అధికారం



మాట్లాడుతున్న ఆగయ్య

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీకి ఇదే చివరి అధికార అవకాశమని, రాబోయే ఎన్నికల్లో ఆపార్టీకి ప్రజలు చావుదెబ్బ కొట్టడం ఖాయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సాధ్యం కాని హామీలతో అధికారం చేజిక్కించుకుని ఇప్పుడు ప్రజలకు రిక్తహస్తం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. అశాస్త్రీయ పద్ధతిలో చేపట్టిన సర్వేలో బీసీల జనాభా తగ్గించిన సీఎం తమ సామాజిక వర్గం ఉన్నత కులాల జనాభా పెంచారని ఆరోపించారు. జిల్లాలో ముఖ్య అధికారులు కేవలం కాంగ్రెస్ పార్టీపై పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్ నేతల వ్యాపారాలను మూసి వేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టీఎస్‌పీటీడీసీ మాజీ అధ్యక్షుడు గూడూరి ప్రవీణ్, నాయకులు గజభీంకార్ రాజన్న, కోడి అంతయ్య, దిడ్డి రాజు, బండ నర్సయ్య యాదవ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

తంగళ్లపల్లి: ఓబులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి కరాటే సబ్ జూనియర్ విభాగంలో సత్తాచాటారు. పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని బత్తుల శ్రీలక్ష్మి మొదటి స్థానం, ఆరవ తరగతి విద్యార్థిని బత్తుల ఇందు ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం ఉపేందర్ తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.